క్లుప్తంగా

పెన్షనర్ల సమస్యలపై ఎంపీ శ్రీధర్‌కు వినతి



ఏలూరులో ఎంపీ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బ్యాంకు పెన్షనర్లు

దెందులూరు: తమ జీవన విధానానికి ఆటంకం లేకుండా సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను బ్యాంకు పెన్షనర్లు కోరారు. సోమవారం ఎంపీ కార్యాలయంలో ఎంపీని బ్యాంక్ పెన్షనర్లు కలిసి సమస్యలు వివరించి వినతిపత్రాన్ని అందజేశారు. బ్యాంకు పెన్షనర్ల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఎంపీ వారికి హామీ ఇచ్చారు.

కంప్యూటర్ సైన్స్‌లో చందుకు డాక్టరేట్



డాక్టరేట్ పొందిన యలమర్తి చందుతో తల్లిదండ్రులు శ్రీనివాసరావు, హేమలత

దెందులూరు: తెలుగు తేజం యలమర్తి చందు అమెరికాలో తన ప్రతిభాపాటవాలను చాటాడు. దెందులూరు మండలం పెరుగ్గూడెంకు చెందిన పాటెమ్మ తల్లి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ యలమర్తి శ్రీనివాసరావు, హేమలత కుమారుడు చందు అమెరికాలో మాస్టర్ ఇన్ కంప్యూటర్ సైన్స్‌లో డాక్టరేట్ పొందారు. పెరుగ్గూడెంకు చెందిన విద్యార్థి అమెరికాలో సత్తాచాటి టెక్సాస్ రాష్ట్రంలో యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్ నుంచి మాస్టర్స్ ఇన్ కంప్యూటర్ సైన్స్‌లో డాక్టరేట్ పొందడంపై గ్రామస్తులు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

మట్టి ట్రాక్టర్ల హల్‌చల్



ట్రాక్టర్‌లో మట్టి తరలిస్తున్న దృశ్యం

ఉంగుటూరు : మండలంలో మట్టి మాఫియా పగడ విప్పింది. ఉంగుటూరు, కైకరం, వెల్లమిల్లి, నాచుకుంట, నీలాద్రిపురం, గొల్లగూడెం ప్రాంతాల్లో మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. కొందరు జేసీబీ మెషీన్లతో మట్టిని తవ్వి ట్రాక్టర్‌లలో ఎగుమతి చేసి సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు వ్యవసాయ భూములను స్థలాలుగా మార్చేందుకు మెరకపనులు చేస్తుండగా, మరికొందరు ఇళ్ల వద్ద మెరకపనులు చేస్తున్నారు. మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్న రెవెన్యూ అధికారులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఉంగుటూరులో నాలుగు రోజులుగా పొలాల్లో మట్టిని విక్రయిస్తున్నారు. వందలాది ట్రాక్టర్లలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు.

ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం



గుండుగొలనులో సీఎస్ఐ ఆంధ్రేయ చర్చిని ప్రారంభిస్తున్న దృశ్యం

భీమడోలు: ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని కృష్ణా గోదావరి అధ్యక్ష ఖండం పీఠాధిపతులు డాక్టర్ తంటిపూడి జార్జ్ కొర్నేలియస్ అన్నారు. గుండుగొలనులో ఆధునిక హంగులతో సుందరంగా నిర్మించిన సీఎస్ఐ పరిశుద్ధ ఆంధ్రేయ దేవాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తొలుత పీఠాధిపతులు డాక్టర్ తంటిపూడి జార్జ్ కొర్నేలియస్, కృష్ణా గోదావరి అధ్యక్ష ఖండం ఉమెన్స్ ఫెలోషిప్ అధ్యక్షురాలు దాసరి జాషువా కుమారికి ఘన స్వాగతం పలికారు. సంఘం పాస్టర్ నానిబాబు, సంఘం కాపరి ఎస్‌వీఆర్ విజయరాజు, ఈసీ సభ్యుడు చేబత్తిన అనిల్‌కుమార్, కౌన్సిల్ సభ్యులు బోడ రాజమణి, కడిమే బాలస్వామి, వార్డు సభ్యుడు గొటికల మురళీ, కోస్తాంధ్ర పీఠం పరిధిలోని పాస్టర్లు హాజరయ్యారు.

తరగతుల నిర్వహణ తగదు

దెందులూరు: ఎండలు మండుతున్నా పట్టించుకోకుండా 10వ తరగతి క్లాసులు నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై కలెక్టర్, డీఈఓ చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. మండలంలో అన్ని గ్రామాల నుంచి ఏలూరులోని పాఠశాలలకు విద్యార్థులు ఆయా పాఠశాలల వాహనాల్లో వెళ్తున్నారు. ప్రభుత్వం వేసవి సెలవు లిచ్చినా ప్రైవేటు యాజమాన్యాలు తరగతులు నిర్వహించడంపై విమర్శలు వస్తున్నాయి.

తారెత్తిస్తున్న ఎండలు



గణపవరంలో ఉదయం 11 గంటలకే జనసంచారం లేని ఏలూరు రోడ్డు



దప్పిక తీర్చుకుంటున్న సపోటా పండ్ల వ్యాపారి



నిర్మానుష్యంగా భీమడోలు, ద్వారకాతిరుమల రాష్ట్ర రహదారి



చానమిల్లిలో మర్రిచెట్టు నీడన సేద తీరుతున్న గ్రామస్తులు



మండుటెండలో జీడికాయలు విక్రయిస్తున్న మహిళ

గణపవరం : నాలుగు రోజులుగా భానుడి ప్రతాపానికి ఊళ్లు నిప్పుల కొలిమిలా మారాయి. ఉదయం 7 గంటలకే సూర్యుడు ఉగ్రరూపం దాలుస్తున్నాడు. పది గంటలు దాటితే గడప దాటాలంటేనే జనం హడలిపోతున్నారు. ఇళ్లలో తలుపులు బిగించుకుని ఎండ దెబ్బ తగలకుండా కాలం గడుపుతున్నారు. సాయంత్రం 5 గంటల వరకూ రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. అధిక ఎండ, ఉక్కబోతతో జనం అల్లాడిపోతున్నారు. అత్యవసర పనులుంటే తప్ప బయటకు రావడానికి భయపడుతున్నారు. తప్పనిసరి పరిస్థితులలో బయటకు వచ్చే వారు గొడుగులు, క్యాప్‌లు, నెత్తిన తువ్వాళ్లు చుట్టుకుని బయటకు వస్తున్నారు. రోడ్లపై వెళ్లే వాహనదారులు రోడ్ల పక్కన చెట్లక్రింద తమ వాహనాలను నిలిపివేసి సేదతీరుతున్నారు. వ్యాపారులు మధ్యాహ్నం 12 గంటలు దాటితే షాపులు మూసివేసి సాయంత్రం 5 గంటలు దాటాకే తెరుస్తున్నారు. కానీ పండ్లు అమ్ముకునే చిరువ్యాపారులు మాత్రం మండుటెండలోనే మలమల మాడుతూ తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. మరోవారంలో రోహిణీకార్తె రాకతో ఎండల తీవ్రత మరింతగా ఉండే అవకాశం ఉందని జనం బెంబేలెత్తిపోతున్నారు.

భీమడోలులో 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు

భీమడోలు : మండుతున్న ఎండల ధాటికి ప్రజలు విలవిల్లాడుతున్నారు. భీమడోలులో సోమవారం 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 9 గంటల నుంచే ఎండ మండిపోతుండడంతో ప్రజలు ఇండ్లకే పరిమితమయ్యారు. దీంతో జాతీయ, రాష్ట్రీయ రహదారులు, గ్రామాల్లోని రోడ్లు జన సంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. అత్యవసర పనుల నిమిత్తం బయటకు వచ్చిన వారు ఎండ తాకిడికి నానా ఇబ్బందులు పడ్డారు. మరో నాలుగు రోజుల పాటు ఇవే ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. చిన్నారులు, వృద్ధులు, రోగులు బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

భీమడోలు : భీమడోలు జంక్షన్‌లో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని తహసీల్దార్ షంషూద్దీన్ ప్రారంభించారు. బాటసారులు, యాత్రికులు, ప్రయాణికులకు మజ్జిగ అందించారు. ఈ సందర్భంగా దాత గోనుగుంట రమణశంకర్‌ను అభినందించారు. నీలాపు వరప్రసాదరెడ్డి రూ.4వేల విలువ గల చలివేంద్రం స్టాండ్‌ను ఉచితంగా అందించారు. ప్రతి శనివారం దాతల సాయంతో బస్టాండ్ వద్ద ప్రయాణికులకు మజ్జిగను పంపిణీ చేస్తామన్నారు. తొలుత మానవత జిల్లా డైరీని జిల్లా అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు తహసీల్దార్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ జిల్లా చైర్మన్ అప్పక రాంబాబు, మండల చైర్మన్ గుల్ల నూకరాజు, మండల కన్వీనర్ పంచకర్ల సత్యనారాయణ, కోశాధికారి గుల్ల అప్పారావు, ప్రతినిధులు దూడి రాజేష్, అల్లాడ వరప్రసాద్, ఉన్నమట్ల సత్యనారాయణ, రామారాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా విజ్ఞాన శిబిరం

భీమడోలు : భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ఉల్లాసభరిత వాతావరణంలో సోమవారం కొనసాగాయి. భీమడోలులో యోగా నిపుణుడు భావానా రుషి చిన్నారులకు యోగాసనాలపై శిక్షణ అందించారు. ఇంగ్లీష్, తెలుగు, గణితం సబ్జెక్టులపై పట్టు సాధించేలా వారికి మెలకువలను అందించారు. రిసోర్స్‌పర్సన్ మండే సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులు నీతి కథలు చదవడం ద్వారా నైతిక విలువలు అలవడతాయన్నారు. పూళ్లలో యోగా ట్రైనర్ కురెళ్ల కిషోర్, గేదెల ఈశ్వరమ్మ చిన్నారులకు భగవద్గీత శ్లోకాలు తెలియజేశారు. గాంధీ చిన్నారులకు మజ్జిగను అందించారు. గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత





మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

- ధాన్యం కొనుగోలులో జిల్లాలోనే రెండోస్థానంలో పెదపాడు మండలం
- 40వేల మెట్రిక్ టన్నుల సేకరణ
- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదపాడు: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలోని సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. పెదపాడు మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం ఎంపీపీ బత్తుల రత్నకుమారి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ మండలంలోని రహదారులు అభివృద్ధి చేస్తున్నామని పెదపాడు పెరికీడు రహదారి పరిస్థితులపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. గడపగడపకు మన ప్రభుత్వంలో ఎన్ని సమస్యలు వచ్చాయి. ఎన్ని సమస్యలు పరిష్కరించారని అధికారులను ఆయన ప్రశ్నించారు. ఉచిత విద్యుత్ నిరంతరాయంగా తొమ్మిది గంటలపాటు అందిస్తామన్నారు. ఎక్కడా లో ఓల్టేజి సమస్యలు లేకుండా చూడాలని విద్యుత్ శాఖాధికారులను ఆదేశించారు. సత్యవోలులో న్యూ సబ్ స్టేషన్ నిర్మాణానికి అనుమతులు రావాల్సి ఉందన్నారు. మండలంలోని వట్లూరు కొప్పాక, వట్లూరు కొక్కిరపాడు, కలపర్రు–వట్లూరు రహదారులను అభివృద్ధి చేసామని, కలపర్రు దాసరి గూడెం రహదారి నిర్మాణంలో ఉందన్నారు. నాయుడుగూడెం–రాజుపేట, సత్యవోలు వడ్డిగూడెం, కొత్తూరు ముప్పర్రు రహదారికి అనుమతులు రావాల్సి ఉందన్నారు. రానున్న ఆరు నెలల్లో మిగతా రహదారులు సైతం పూర్తి చేస్తామని చెప్పారు. జేజేఎం ద్వారా నాయుడుగూడెం, కడిమికుంట, ఖాజీగూడెం సత్యన్నారాయణపురం, పెదపాడు గ్రామాల్లో పైపులైన్ల మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. ఇటీవల మండలంలో 16,443 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు అందించినట్టు అధికారులు తెలిపారు. 1962 నంబరుకు ఫోను చేస్తే పశువులకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు సంచార పశువైద్య వాహనం వస్తుందన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రూ.13.79 కోట్లు డ్వాక్రా మహిళలకు అందించామని ఎమ్మెల్యే చెప్పారు. గృహనిర్మాణానికి స్త్రీనిధి నుంచి రూ.35వేలు ఆర్థిక సహాయం అందిస్తున్నట్టు తెలిపారు. ఫ్యామిలీ డాక్టరు పథకం ఎలా చేస్తున్నారంటూ వైద్యులను ప్రశ్నించారు. మండలంలోని కరోనా పరిస్థితిపై ఆరా తీసారు. సక్రమంగా వైద్యసేవలు అందించాలని సూచించారు. వట్లూరు పీహెచ్‌సీ పరిధిలో హెల్త్ అసిస్టెంట్, ఏఎన్ఎంలు డిప్యూటేషన్‌పై వెళ్లిపోవడంతో సంబంధిత ఖాళీలను బర్తీ చేయాలని సంబంధిత అధికారులకు లేఖ రాయాలని ఎంపీడీవోను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు. అనాథలు, హెచ్‌ఐవీ సోకిన వారి పిల్లలకు మిషన్ వాత్సల్య స్కీమ్‌లో రూ.4వేలు కేంద్రం ఇవ్వనుందని, తమ ప్రాంతాల్లో అలాంటి పిల్లల వివరాలు ఐసీడీఎస్ అధికారుల ద్వారా ఆన్‌లైన్ చేయించుకోవాలన్నారు. రైసు మిల్లర్ల అసోయేషన్ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల సతీష్ చౌదరి మాట్లాడుతూ మండలంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా రైతులకు గిట్టుబాటు ధరను అందిస్తూ 40వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రబీలో 5వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయగా, 5 రోజుల్లో ధాన్యం డబ్బులు చెల్లించడం జరిగిందన్నారు. రవాణా చార్జీలు సైతం ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని సర్పంచ్‌లు ఎంపీటీసీలు ప్రజలకు వివరించాల్సిన అవసముందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, వైస్ ఎంపీపీలు అప్పన పద్మావతి, రెడ్డి స్వర్ణకుమారి, నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, ఎంపీడీవో ఎస్ నిర్మల జ్యోతి వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మండల స్థాయి అధికారులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అర్హులందరికీ నవరత్న పథకాలు



పెదపాడు మండలంలోని ఏపూరులో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- ఏపూరులో గడపగడపకు మన ప్రభుత్వం

పెదపాడు: అర్హులందరికీ నవరత్న పథకాలు అందించేందుకు అధికారులు, సచివాలయ సిబ్బంది కృషి చేయాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సూచించారు. మండలస్థాయి అధికారులు గ్రామాల్లో సమస్యలపై దృష్టి సారించాలని ఆయన అన్నారు. పెదపాడు మండలంలోని ఏపూరులో శనివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్న తీరును వారిని అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల స్థలాలు కావాలని, డ్రైనేజీలు నిర్మించాలని, ఇళ్ల రుణాలు అందించాలని కొంతమంది అడగటంతో వెంటనే సంబంధిత సమస్యల పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల రుణాలు కావాల్సిన వారి పేర్లు నమోదు చేసుకోవాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు చెప్పిన సమస్యలను నమోదు చేసుకుని గ్రామస్థాయి, మండల స్థాయిలో సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఆపై స్థాయి సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. వేసవి నేపథ్యంలో మంచి నీరు, విద్యుత్ సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలకు పలు సూచనలు సలహాలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బత్తుల రత్నకుమారి, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, సంబంగి శ్రావణ్ కుమార్, వైస్ ఎంపీపీ అప్పన పద్మావతి, సర్పంచ్ చిన్నాల ఝాన్సీ, అప్పనవీడు ఎంపీటీసీలు బుద్దే రామసీత, వీరంకి బుజ్జి, గ్రామ సర్పంచ్ చోడగిరి రామకృష్ణ, ఎంపీటీసీలు నాగమల్లేశ్వరరావు బెజవాడ శిరీషా శేఖర్, స్థానిక బెజవాడ నర్సింహారావు, బెజవాడ సత్యనారాయణ, చోడగిరి బిక్షాలు పాల్గొన్నారు.

19, 20 తేదీల్లో గాలాయగూడెంలో..

దెందులూరు: గాలాయగూడెంలో ఈ నెల 19, 20 తేదీల్లో నిర్వహించనున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ముఖ్య అతిథిగా పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. సోమవారం సచివాలయంలో సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో ఆయన మాట్లాడారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ తోటఅచ్చియ్య, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షులు అంబటి లక్ష్మణరావు, పెద్దిశెట్టి బసవయ్య, పర్వతనేని సుధీర్, వార్డు మెంబర్లు ఉన్నారు.

కాటన్ దొర సేవలు చిరస్మరణీయం



నిడమర్రులో కాటన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు



భీమడోలులో కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



దెందులూరులో కాటన్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న పోకల రాంబాబు తదితరులు

భీమడోలు : గోదావరి జిల్లాల ప్రజల పాలిట అపర భగీరధుడు సర్ ఆర్థర్ కాటన్ అని తహసీల్దార్ షంషూద్దీన్, ఎంపీడీవో డి.సత్యనారాయణ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సర్ ఆర్థర్ కాటన్ దొర జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గోదావరి డెల్టాను సస్యశ్యామలం చేసిన కాటన్ దొర సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన ఉమ్మడి జిల్లాల ప్రజలు, రైతులకు అపర భగీరధుడయ్యారన్నారు. ఆయన సేవలకు చిహ్నం గోదావరి డెల్టాలోని కాల్వ వెంబడి గ్రామాల్లో వేలాదిగా కాటన్ విగ్రహాలు ఏర్పాటు చేశారన్నారు. బ్రిటీష్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఆయన పడిన కష్టం, శ్రమ మరవలేనిదన్నారు. గోదావరి జలాలు అందడంతో ఇక్కడ ప్రజలు, రైతులు అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ ఎం.ముత్తయ్య, వీఆర్వోలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

నిడమర్రు : రైతుల హృదయాల్లో సర్ ఆర్థర్ కాటన్ దొర చిరస్థాయిగా నిలిచారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నంద్యాల రామలింగరాజు అన్నారు. సోమవారం కాటన్ దొర జయంతి సందర్భంగా నిడమర్రు కొల్లేరు రోడ్‌లోని కాటన్ విగ్రహానికి, పత్తేపురం గ్రామంలోని కాటన్ విగ్రహానికి పలువురు నేతలు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఆయా గ్రామాల్లోని కార్యక్రమాల్లో మానవత మాజీ జిల్లా అధ్యక్షుడు సాగిరాజు జానకి రామరాజు, ఉంగుటూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ ఇంటి ఉదయ భాస్కర్, గణపవరం, నిడమర్రు మండలాల ఉపాధ్యక్షులు ఆదిపరెడ్డి సీతయ్య, శానా సత్యనారాయణ, కూరాకుల బాబూరావు, మానవత జోనల్ చైర్మన్ కాకర్ల వినాయకం, సూరిబాబు తదితరులున్నారు.

ఉభయగోదావరి జిల్లాలకు కాటన్ దొర ప్రాణదాత

దెందులూరు: ఉభయగోదావరి జిల్లాలకు సాగు, తాగునీటికి రూపకర్త కాటన్ దొర సేవలు నిరంతరం చిరస్మరణీయమని, చరిత్ర ఉన్నంత కాలం ఆయన స్ఫూర్తి ప్రదాతగా ఉంటారని దెందులూరు వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు, కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు అన్నారు. సోమవారం దెందులూరులో లైబ్రరీ సెంటర్ వద్ద దెందులూరు నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో కాటన్ దొర జయంతిని నిర్వహించారు. నూకరాజు తదితరులు కాటన్ దొర సేవలను కొనియాడారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సంపెంగ వేణుగోపాల్ తిలక్, గ్రామ టీడీపీ అధ్యక్షులు ఇప్పిలి వెంకటేశ్వరరావు, గ్రామస్తులు మొటపర్తి రాజా, దెందులూరు గ్రంథాలయ అధికారి రాజ్యలక్ష్మి, సర్పంచ్ తోట ఏసమ్మ, రైతులు, నర్సింగ్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సాయం అందించేందుకు కృషి

భీమడోలు : పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న రైతు యారపుత్తూరి సూర్యనారాయణరాజు (35) కుటుంబాన్ని సోమవారం తహసీల్దార్ షంషూద్దీన్ పరామర్శించారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన తండ్రి నాగరాజు కోలుకుంటుండగా కుమారుడు సూర్యనారాయణరాజు భౌతికకాయాన్ని పోస్టుమార్టమ్ అనంతరం పూళ్ల పంచాయతీ శివారు సాయన్నపాలెంలోని ఇంటికి తరలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అప్పుల నేపథ్యంలో కష్టపడే తత్వం గల రైతులు నాగరాజు, సూర్యనారాయణరాజు క్షణికావేశంలో పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడడం బాధాకరమని, ఇది సరైన చర్య కాదన్నా రు. సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. సూర్యనారాయణరాజు కుటుంబానికి ప్రభుత్వం సాయం అందేలా తన వంతు కృషి చేస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ నేతలు దాయం ప్రసాద్, టి.సుబ్బిరెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

నలుగురికి గాయాలు

ఉంగుటూరు : జాతీయ రహదారిపై చేబ్రోలు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. సోమవారం మధ్యాహ్నం పూళ్ల నుంచి ఉండి మండలం ఉప్పునూరు వెళుతున్న చిన్న కారు చేబ్రోలు ఊరి చివర నిలుపుదల చేశారు. ఆగి ఉన్న ఆ కారును వెనుక నుంచి మరో కారు ఢీకొంది. దీంతో ఆగి ఉన్న కారులోని యర్రా కేశవరావు (50), దృశ్యంత్ (5)కు తీవ్రగాయాలయ్యాయి. వీరిని తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇదే ప్రమాదంలో గాయపడిన మరో కారులోని పి.జగన్‌మోహన్, లక్ష్మీప్రసన్నలను అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం తరలించారు. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఉంగుటూరు : గొల్లగూడెం గ్రామంలో నారాయణపురం సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ డైరెక్టర్ దాసరి సత్యనారాయణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు వెలిశెట్టి పాపారావు బాజ్జి మాట్లాడుతూ మొక్కజొన్న క్వింటాల్‌కు రూ.1962 ప్రభుత్వం మద్దతు ధర అందజేస్తుందని, తప్పనిసరిగా రైతులు ఆర్‌బీకేల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కండెపు రవికుమార్, ఛాత్రాతి శ్రీను, గంగాధరరావు పాల్గొన్నారు.

గ్రామీణ పేదల కోసమే ఫ్యామిలీ డాక్టర్

గణపవరం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను గ్రామీణ ప్రాంతాలలోని పేదలు వినియోగించుకుని ఆరోగ్యవంతులుగా ఉండాలని పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.ప్రియాంక అన్నారు. సోమవారం గణపవరం మండలం చిలకంపాడు వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం, 104 వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా 10 మంది గర్భిణులకు, ముగ్గురు బాలింతలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. సాధారణ వ్యాధిగ్రస్తులు, కిశోర బాలికలు, అంగన్‌వాడీ పిల్లలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు 180 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మంచానికే పరిమితమైన రోగులకు వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు నామాల రాజు, డేటా ఆపరేటర్ వసంత, ఎంఎల్‌హెచ్‌పీ మాధురి ప్రకాష్, ఏఎన్ఎం ఏసమ్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు రూ. 600 వేతనం ఇవ్వాలి

దెందులూరు: జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు 200 రోజులు పని కల్పించి రోజు రూ. 600 వేతనం కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే.రామకృష్ణ కోరారు. సోమవారం మండలంలోని దెందులూరులో అప్పారావు చెరువు వద్ద ఉపాధి హామీ పనుల వద్ద కూలీలను కలిశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి కూలీల జీవన విధానం మరింత మెరుగుపర్చేందుకు వారికి పూర్తిస్థాయిలో భద్రత కల్పించాలని అన్నారు.